క్లుప్తంగా

ట్రస్టు ఆధ్వర్యంలో కల్యాణ కానుక అందజేత



పిడుగురాళ్ల: పట్టణంలోని పల్నాడు హాస్పటల్‌లో చింతలపూడి చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురజాల నియోజకవర్గం తేలుకుట్ల గ్రామానికి చెందిన కనిగిరి సైదారావు, నాగజ్యోతిల కుమార్తె నాగదుర్గకు బుధవారం కల్యాణ కానుక అందజేశారు. ఈసందర్భంగా ట్రస్టు సభ్యులు గుంటుపల్లి రామారావు మాట్లాడుతూ పెళ్లికుమార్తెకు తాళిబొట్టు, పట్టుచీరను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



దాచేపల్లి : నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. వేసవికాలం నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని యార్డు చైర్మన్ కలకండ ఆంధ్రయ్య ప్రారంభించారు. వేసవి కాలం తీవ్రత ఎక్కువగా ఉందని, వేసవికాలంలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడకూడదని చలివేంద్రం ఏర్పాటు చేశామని చైర్మన్ ఆంధ్రయ్య చెప్పారు. కార్యక్రమంలో యార్డు కార్యదర్శి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు సాంబశివరావు, వెంగయ్య, డైరెక్టర్లు మండ్లేం రామారావు, కటికాల శిల్వరాజు, సిబ్బంది రషీద్, నాగార్జున పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కారెంపూడి: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ పి వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఐదవ తరగతిలో 40 సీట్లున్నాయని వాటిలో ఎస్టీలకు 32, ఎస్సీలకు 5, ఓసీ 1, బీసీ విద్యార్థులకు రెండు సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఆరవ తరగతిలో 20, ఏడవ తరగతిలో 24, 8వ తరగతిలో 20, 9వ తరగతిలో 8 ఖాళీలున్నాయని అవన్నీ కూడా గిరిజన విద్యార్థులకు మాత్రమే ప్రత్యేకించడం జరిగిందని వివిధ తెగల ఎస్టీ విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఖాళీల కన్నా దరఖాస్తులు ఎక్కువగా వస్తే లాటరీ పద్ధతిలో సీట్లు భర్తీ చేయడం జరుగుతుందని ప్రిన్సిపల్ వేణుగోపాల్ పేర్కొన్నారు.

నేడు వాహనాల వేలం

గురజాల : స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ ఆఫ్ బ్యూరో (సెబ్) కార్యాలయంలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను గురువారం వేలంపాట నిర్వహించడం జరుగుతుందని సెబ్ ఎస్ఐ జయరాం తెలిపారు. ఈ వేలంపాటకు నర్సరావుపేట సెబ్ కార్యాలయం ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించడం జరుగుతుందని ఆసక్తి కలిగిన వారు వేలంపాటలో పాల్గొనాలని కొరారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



మాచవరం: మండలంలోని అకురాజుపల్లిలో వేంచేసియున్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామికి హనుమాన్ జయంతి పురస్కరించుకుని బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొత్తపాలెం గ్రామం నుంచి ఆకురాజుపల్లి కుంకు బండ్లో వచ్చి భక్తులు మొక్కులను చెల్లించుకున్నారు. స్వామివారి విశేష పూజలు నిర్వహించి భక్తుల దర్శనార్థం ఉంచారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

మాచర్ల: ప్రతి ఒక్కరూ పర్యావరణ పై అవగాహన పెంపొందించుకోవాలని, మొక్కల పెంపకం తో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని మాచర్ల అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ బివి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణంలోని వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్‌కెబిఆర్ కళాశాల గ్రౌండ్‌లో వాకర్స్‌కు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అటవీ శాఖాదికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడబడితే అక్కడ వ్యర్థ పదార్థాలు వేయడం బాధాకరమన్నారు. దీనిని నిర్మూలించేందుకు అవగాహన కల్పిస్తూ పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోపవరపు నాగేశ్వరరావు, చెంచురెడ్డి, పలువురు అసోసియేషన్ సభ్యులు పాల్గొని పర్యావరణ పరిరక్షణ పై ప్రతిజ్ఞ చేశారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు నాంది

- హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ అయిన కేసానుపల్లి యూపీ స్కూల్
- గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరంగా స్థానికుల హర్షం
- ఎమ్మెల్యే కాసు కృషితో అప్‌గ్రేడ్



కేసానుపల్లి ప్రభుత్వ పాఠశాల

దాచేపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో విద్య వ్యాప్తి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా అదుబాటులోనే చదువుకునే వెసులుబాటు కల్పించింది. విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తుంది. ఈ క్రమంలోనే మండలంలోని కేసానుపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ఆర్జేడి ఉత్తర్వులను గత రెండు రోజుల క్రితం జారీ చేశారు. ఇప్పటి వరకు 8వ తరగతి వరకు మాత్రమే ఇక్కడ చదువు చెప్పేవారు. హైస్కూల్ అప్‌గ్రేడ్ తర్వాత 10వ తరగతి వరకు ఇక్కడే ఉచితంగా చదువుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.

విద్యార్థులకు సువర్ణావకాశం..

కేసానుపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 250 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 8తరగతి గదులున్న ఈ పాఠశాలలో 10 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఈ సంవత్సరం 20 మంది విద్యార్థులు 8వ తరగతి పూర్తి చేసుకున్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచే 8వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు 9వ తరగతిలోకి..ఆ తరువాత 10వ తరగతిలోకి ప్రవేశిస్తారు. ఇక్కడ హైస్కూల్ ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజకరంగా ఉంటుంది. కేసానుపల్లితో పాటుగా తక్కెళ్లపాడు, కాచవరం, ఇనుపరాజుపల్లె, అలుగుమల్లెపాడు నుంచి కూడా హైస్కూల్‌లో చదువుకునేందుకు విద్యార్థులు వచ్చే అవకాశం ఉన్నది. బస్సు సౌకర్యం ఉండడం వల్ల హైస్కూల్‌కు రాకపోకలు సాగించవచ్చు. కేసానుపల్లిలో రైల్వేగేట్, అద్దంకి–నార్కెట్‌పల్లి హైవే రోడ్డు దాటుకుంటూ విద్యార్థులు దాచేపల్లి హైస్కూల్‌లో చదువుకుంటున్నారు. ఈ క్రమంలో విద్యార్థులు పలు ఇబ్బందులను సైతం ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు కేసానుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునే అవకాశంను ప్రభుత్వం కల్పించింది. హైస్కూల్ అప్‌గ్రేడ్‌తో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశాలున్నాయి.

ఎమ్మెల్యే చొరవతో అప్‌గ్రేడ్..

హైస్కూల్ చదువుల కోసం విద్యార్థులు పడుతున్న కష్టలను గ్రామస్తులు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో పర్యటించిన ప్రతి సందర్భంలోను హైస్కూల్ అప్‌గ్రేడ్ గురించి వైఎస్సార్ సీపీ నేతలు ఎమ్మెల్యే కాసుతో మాట్లాడేవారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని హైస్కూల్ అప్‌గ్రేడ్ కోసం ఉన్నతాధికారులను కలిశారు. ఎమ్మెల్యే కాసు అభ్యర్థనతో యూపి పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసి ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్యే కృషితో గ్రామస్తులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు నాంది..



కేసానుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో దాచేపల్లి హైస్కూల్‌కు వెళ్లి చదువుకోలేక ఎంతో మంది విద్యార్థులు చదువులను మధ్యలోనే మానేస్తున్నారు. ఇప్పుడు హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయడం వల్ల మా గ్రామం చుట్టూ పక్కల ఉన్న గ్రామాల్లోని విద్యార్థులు కూడా ఇక్కడ చదువుకోవచ్చు. హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేసిన కృషి అభినందనీయం.

– నెల్లూరి కోటేశ్వరరావు. కేసానుపల్లి.

పేద విద్యార్థులకు వరం



హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ కావడం నిరుపేద విద్యార్థులకు వరం. హైస్కూల్ అందుబాటులో లేక..ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు కట్టలేక చదువు మానేసివాళ్లే ఉన్నారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు ఎంతో కృషి చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో హైస్కూల్‌గా మార్చడం విద్యార్థులకు మంచి బహుమానం.

– వినుకొండ కోటేశ్వరరావు. సర్పంచ్. కేసానుపల్లి

పేదల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



లబ్ధిదారులకు పథకాలపై వివరిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి మేలు చేయటమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే ఆయా కుటుంబాలకు మేలు గురించి వివరించే ప్రయత్నంలో భాగంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని 22వ వార్డులో సాగర్ రోడ్డులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులనుద్దేశించి మాట్లాడుతూ దేశ చరిత్రలో ఒక కుటుంబానికి నిరంతరం నాలుగేళ్ళుగా ఆర్థికంగా బలోపేతం చేసి వారి జీవితాల్లో వెలుగునింపిన ఘనత ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వార్డు కౌన్సిలర్ బత్తుల నరసింహారావు, సచివాలయ కన్వీనర్ గోవిందరాజు, నియోజక వర్గ బిసి వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి వల్లెపు వెంకటేశ్వర్లు, వేముల గిరి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపుగా 270 కుటుంబాలను సెయింటాన్స్ ఇంగ్లిషు మీడియం స్కూల్ ప్రాంతం నుంచి ప్రారంభించి ఆ వార్డు ప్రతి ఇంటి గడప ఎక్కి ఆ కుటుంబాలకు చేకూరిన లబ్ధి గురించి వివరంగా వివరించారు. ప్రతి లబ్దిదారుడు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రతిపక్షాల విమర్శలు పట్టించుకోకుండా ముందుకెళ్లి జగన్‌కు జే జేలు పలికి మరొక్కసారి ఆయనను అధికారంలోకి తీసుకొచ్చి జే జేలు పలికేందుకు పేద ప్రజలంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు బత్తుల ఏడుకొండలు, అబ్దుల్ జలీల్, తురక కిషోర్, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, కౌన్సిలర్లు బత్తుల నరసింహారావు, ఎం మురళీ, పోలా శ్రీను, చందూ గౌడ్, మాచర్ల చిన ఏసోబు, మందా సంతోష్, షేక్ కరిముల్లా, మస్తాన్, సుభాని, ఎంఆర్‌ఎఫ్ రామాంజనేయరెడ్డి, రామిశెట్టి వెంకటేశ్వర్లు, పట్టణానికి చెందిన బిసి సంఘ నాయకులు చల్లా కాశయ్య, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సీహెచ్ శ్రీను, పిల్లి కొండలు, దేరంగుల వెంకటేశ్వర్లు, మహంకాళి రాజు, తురక శ్రీను, శ్రీనివాసరావు, వడ్డెర సంఘ నాయకులు బత్తుల శ్రీను, వెంకటస్వామి, ఓర్సు విజయ్, వల్లెపు సాయి, టైలర్ రాజు, సాంబశివరావు, మాజీ కౌన్సిలర్ వేముల కళ్యాణితో పాటు పలువురు నాయకులు, మున్సిపల్ కమిషనర్ ఈ వి రమణబాబు, స్థానిక మెప్మా ప్రాజెక్టు మిషన్ మేనేజర్ సుబ్బారావు, అంజలి, సచివాలయ కన్వీనర్లు, అడ్మిన్‌లు, వలంటీర్లు, ఆర్‌పిలు పాల్గొన్నారు.

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఏఓ యలమందారెడ్డి

కారెంపూడి: రైతులు తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని దాని వల్ల భూసారంలో ఉన్న లోపాలు తెలుస్తాయని తర్వాత ఆ పోషక లోపాలను సరి చేయడానికి సరైన ఎరువులను వాడుకునే అవకాశం కలుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి బి యలమందారెడ్డి తెలిపారు. మండలంలోని నరమాలపాడు గ్రామంలో ఖరీఫ్ ముందస్తు ప్రణాళికలో భాగంగా రైతు సదస్సును ఎంఏఓ బుధవారం నిర్వహించారు. భూసార పరీక్షలు చేయించుకోవడం చాలా సులభమని ప్రతి గ్రామంలో ఇప్పుడు రైతు భరోసా కేంద్రాలున్నాయని ప్రతి గ్రామంలో వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారని వారికి సమాచారం ఇస్తే వారే పొలానికి వచ్చి మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షకు పంపి ల్యాబ్ నుంచి ఫలితాలు వచ్చాక వాటిని రైతులకు తెలుపుతారని పేర్కొన్నారు. అలాగే పచ్చిరొట్ట పైర్లు సాగు చేసి వాటిని భూమిలో కలియ దున్నడం ద్వారా భూసారం పెరుగుతుందని రైతులు ప్రభుత్వం సబ్సిడీపై అందించే పచ్చి రొట్ట పైర్ల విత్తనాలు తీసుకుని వాటిని పంట వేసే ముందు సాగు చేసి పైరును దుక్కిలో కలియదున్నాలని సూచించారు. కౌలు రైతులు కౌలు రైతు కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఆ గ్రామ వీఆర్వో కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. కౌలు రైతు కార్డులున్న రైతులకు రైతు భరోసా పెట్టుబడి సాయంతో పాటు పంట నష్టం జరిగినప్పుడు పరిహారం పొందడానికి వీలు కలుగుతుందని వీఆర్వో వివరించారు. సమావేశంలో గ్రామ ఉద్యాన వన సహాయకురాలు లక్ష్మీ, రైతులు పాల్గొన్నారు.

కాలనీల్లో మంచినీటి బోర్లు ఏర్పాటు



బోరుకు భూమిపూజ చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ శౌంరిరెడ్డి నర్సిరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల అభివృద్ధిలో భాగంగా మంచినీటి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంరిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. బుధవారం రెంటచింతలలోని రేగులమాన్యం ఎస్టీ కాలనీలో, రైల్‌పేట కాలనీల్లో జెడ్పీ నిధులతో ఏర్పాటు చేస్తున్న బోర్లకు ఆయన సర్పంచ్ పూజల పుష్పావతిరామయ్య, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, పార్టీ నేతలతో కలిసి భూమి పూజా కార్యక్రమాలను నిర్వహించి మాట్లాడారు. ఆయా కాలనీల్లో ప్రస్తుత వేసవిలో ఏర్పడిన మంచినీటి సమస్యను పరిష్కంచాలని స్థానిక నేతలు తన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డిల సూచనల మేరకు మంచినీటి సమస్య పరిష్కరించేందుకు జెడ్పీ నిధులతో బోర్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమలో వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన కార్యవర్గ సభ్యుడు మోర్తల ఉమ, సత్రశాల దేవస్థానం చైర్మన్ బొద్దూరి బ్రహ్మారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఏరువ ప్రమీల విజయ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ గాలి ప్రతాప్‌రెడ్డి, పార్టీ నేతలు మర్రి లూర్ధురాజు, బొంకూరి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో బోరు ఏర్పాటు

కారెంపూడి : ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాలతో మండలంలోని చింతపల్లి ఎస్సీ కాలనీలో మంచినీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. గ్రామ ఎస్సీ కాలనీలో బుధవారం బోరు వేశారు. గ్రామ సర్పంచ్ ఉన్నం శ్రీనివాసరావు, పార్టీ నాయకులు ఉమ్మినేని శివరామకృష్ణ, అంకారావు, మైలా ఏసుపాదం, ఎస్ శివ తదితరులు కొబ్బరి కాయలు కొట్టి బోరు తవ్వకం పనులను ప్రారంభించారు. బోరు బావిలో నీరు లభ్యం కావడంతో నాయకులు హర్షం వ్యక్తం చేశారు. త్వరలో వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసి ఈ ప్రాంత వాసులకు తాగునీరు అందిస్తామని సర్పంచ్ పేర్కొన్నారు.

నేడు విద్యుత్ కోత

గురజాల : నేడు నగర పంచాయతీ పరిధిలో విద్యుత్ కోత నిర్వహించడం జరుగుతుందని విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఇన్‌చార్జి ఏడిఏ టి వీరేశ్వరరావు తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 6 గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలన్నారు.

రైళ్లు పిడుగురాళ్ల స్టేషన్‌లో ఆగేలా చూడాలని వినతి

పిడుగురాళ్ల: పట్టణంలో కోవిడ్‌కు ముందు ఆగిన రైళ్లు మరలా రైల్వే స్టేషన్‌లో ఆగేలా చూడాలని రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ ముత్యాలనాయుడుకు సౌత్ సెంట్రల్ జోనల్ కమిటీ రైల్వే బోర్డు మెంబర్ మద్దాలి సుబ్బయ్య కోరారు. బుధవారం సికింద్రాబాదులో మద్దాలి సుబ్బయ్య నియామక పత్రాన్ని ముత్యాలనాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. ఈసందర్భంగా మద్దాలి సుబ్బయ్య పిడుగురాళ్ల పట్టణంలో ప్రయాణికుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాలు కల్పించాలని, అదేవిధంగా గతంలో ఆగిన రైళ్లు రాత్రి సమయంలో ఆగడం లేదని, పిడుగురాళ్ల లైమ్‌సిటీగా పేరుగాంచిందని, వ్యాపార సదుపాయాల నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు రావాల్సి వస్తోందని దీనిని గమనించి రైళ్లు ఆగేలా చూడాలని ఆయన తెలియజేశారు.

ఇరు వర్గాల మధ్య ఘర్షణ

మాచవరం: ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇరువురికి గాయాలైన ఘటన మండలంలోని పిన్నెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు మధ్య ఓ విషయంలో వివాదం జరగగా ఘటనలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. గాయాలైన వారిని చికిత్స నిమిత్తం పిడుగురాళలో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. స్థానిక ఎస్ఐ కోటయ్య, సీఐ బిలాలుద్దీన్ గ్రామానికి చేరుకుని ఘటనపై విచారణ చేపట్టారు. జరిగిన ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

నేడు సాయిమందిరం వార్షికోత్సవం

నరసరావుపేట రూరల్: జొన్నలగడ్డ షిరిడీ సాయిబాబా మందిరం 22వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహిస్తున్నట్టు షిర్డీ సాయిబాబా భక్తజన సేవా సంఘం ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలకు సన్నాహాలు

ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి

కారెంపూడి: మండలంలో వైఎస్సార్, జగనన్న కాలనీ లే అవుట్స్‌లో సుమారు 2,300 నివాస గృహాలు నిర్మించేందుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు సన్నాహాలు జరుగుతున్నాయని ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. కారెంపూడి లేఅవుట్‌లో నాలుగు బోర్లు వేయించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశించారని చెప్పారు. ప్రస్తుతం లే అవుట్ స్థలాన్ని శుభ్రం చేసే పనులు చేయిస్తున్నామని పిచ్చిచెట్లు కంప తొలగించే పనులు జరుగుతున్నాయన్నారు. త్వరలో ప్రభుత్వ విప్ పీఆర్కే చేతుల మీదగా బోర్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని భావిస్తున్నామన్నారు. కారెంపూడి లేఅవుట్‌లో 927 మందికి నివేశన స్థలాలివ్వడం జరిగిందని వారందరికి కూడా నివాస గృహాలు నిర్మాణం చేయనున్నట్లు పేర్కొన్నారు. నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా నాణ్యమైన మెటీరియల్‌తో ఇళ్ల నిర్మాణం జరుగుతుందని, ఇళ్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం సాయం అందిస్తోందని పేర్కొన్నారు. పట్టాదారులు తమ వద్ద ఉన్న స్థలం పట్టాల జిరాక్స్, ఆధార్ కార్డ్‌ల జిరాక్స్‌లను మండల గృహ నిర్మాణశాఖ కార్యాలయంలో అందించాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి కోరారు.

రీసర్వే గ్రామాల్లో రైతులకు నోటీసులు పంపిణీ



రీసర్వే పనుల పురోగతి పరిశీలించుతున్న భాస్కర్

శావల్యాపురం: రీసర్వే పనులు పూర్తయిన రెవెన్యూ గ్రామాల్లోని రైతులకు ఫామ్ 9(2) నోటీసుల పంపిణీ కార్యక్రమం వేగవంతం చేయాలని నరసరావుపేట డివిజన్ డిప్యూటీ సర్వే ఆఫ్ అధికారి ఉంగరాల వెంకట భాస్కర్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో జరుగుతున్న రీసర్వే పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ మండలంలోని పోట్లూరు రెవెన్యూ పరిధిలో 2425 మంది రైతులు, వేల్పూరు రెవెన్యూ గ్రామంలో 2180 మంది రైతులకు నోటీసులు రైతులకు సకాలంలో అందజేయాలన్నారు. నోటీసులు తీసుకున్న రైతులు రీసర్వే పనుల్లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే సమగ్ర ఆధారాలతో సంబంధిత రైతు రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. తద్వారా సమస్య ప్రాథమిక దశలో పరిష్కార దిశగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటామన్నారు. డ్రాఫ్ట్ లాండ్ రిజస్టరు నమోదు పనులు రెవెన్యూ అధికారులు చేస్తున్నట్లు చెప్పారు. రీసర్వే పనులకు రైతులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ సర్వేయర్ తుంగా శ్రీనివాసరావు, డిప్యూటీ సర్వే అధికారి పి.నాసరయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలి



గండిగనుమలలో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అటవీశాఖ అధికారులు

బొల్లాపల్లి: మండలంలోని బొల్లాపల్లి సెక్షన్ పరిధిలోని రావులాపురం, గండిగనుమల, దోమల గుండం ఫారెస్ట్ బీట్ పరిధిలో పలు గ్రామాల్లో పర్యావరణహిత జీవనశైలిపై బుధవారం ఆశాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సెక్షన్ డీఆర్‌వో వై. సూర్యనారాయణ పర్యావరణం కాలుష్య నియంత్రణపై ప్రజలకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్లాస్టిక్ నిషేధించడం, అటవీ ప్రాంతాల్లో ఒకసారి వాడిన ప్లాస్టిక్‌ను పడవేయరాని సూచించారు. ఇంధనం పొదుపు చేయాలని, దీని వలన అనేక ప్రయోజనాలున్నాయని తెలిపారు. పూర్తి స్థాయిలో ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణ పరిరక్షణకు ఈ ప్రాంత వాసులంతా కలిసికట్టుగా ముందుకు రావాలన్నారు. ఆయా గ్రామస్తులతో పర్యావరణ జీవన విధానంపై అటవీశాఖ అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారులు, వై. భాస్కర్, గణేష్ బాబు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గుంతను తప్పించబోయి ఢీకొన్న లారీలు

శావల్యాపురం: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై లారీలు ఢీకొన్న సంఘటన మంగళవారం అర్ధరాత్రి సమయంలో చోటుచేసుకుంది. ఎస్సై గల్లా రవికృష్ణ తెలిపిన వివరాలు మేరకు వినుకొండ నుంచి మిరపకాయల లోడుతో గుంటూరుకు వెళుతున్న లారీ అదేవిధంగా గుంటూరు నుంచి వినుకొండకు కొబ్బరికాయలు లోడుతో వస్తున్న లారీలు మార్గమధ్యంలో శావల్యాపురంలో ఎదురుగా ఉన్న గుంతను తప్పించపోయి ఢీకొన్నాయని తెలిపారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని ట్రాఫిక్ అంతరాయం వాటిల్లకుండా సత్వరమే క్రేన్ సహాయంతో రోడ్డుకు అడ్డంగా పడిపోయిన రెండు లారీలను పక్కకు తప్పించారు. ఈప్రమాదంలో లారీ డ్రైవరుకు తీవ్రమైన గాయాలు కాగా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు.

ట్రాక్టర్‌పై తీసుకెళ్తున్న గడ్డి దగ్ధం

యడ్లపాడు: పశువులకు కోసం తీసుకువస్తున్న గ్రాసం ప్రమాదవశాత్తు దగ్ధమైన సంఘటన మంగళవారం రాత్రి మండలం పరిధిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం...మండలంలోని సొలస గ్రామానికి చెందిన ఓ రైతు పొన్నూరు ప్రాంతంలో ఎండుగడ్డి కొనుగోలు చేసి ట్రాక్టర్‌పై లోడ్ చేశాడు. బోయపాలెం సెంటర్‌లో ట్రాక్టర్‌ను పక్కన ఆపి టీ సేవించారు. అనంతరం ట్రాక్టర్‌ను తీసుకుని బోయపాలెం వాటర్ ప్లాంట్ దాటిగానే గడ్డి తగలబడుతుందని బాటసారులు కొందరు కేకలేయడంతో అది విన్న డ్రైవర్ వెంటనే అప్రమత్తమైన ట్రాక్టర్‌ను ఊరి బయటకు తీసుకెళ్లి బ్రిక్స్ కంపెనీ సమీపంలో ట్రక్స్‌ను ఎత్తి కాలుతున్న గడ్డిని రోడ్డుపై పడేశాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న గుంటూరు నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది గంటకు పైగా శ్రమించి మంటల్ని అదుపులోకి తెచ్చారు. రోడ్డుపై అడ్డంగా ఉన్న దగ్ధమైన చెత్తచెదారాన్ని జేసీబి తెప్పించి వాహనాల రాకపోకలకు అడ్డం లేకుండా గ్రామ పంచాయతీ సర్పంచ్ వడ్డేపల్లి నరసింహారావు తొలగించారు. అయితే ఆ మార్గంలో విద్యుత్ తీగలు అడ్డుగా లేకపోవడంతో ఎవరైనా ఆకతాయిలు చేశారా.. లేదా ఎండల వేడికి ప్రమాదవశాత్తు ఏర్పడిందా అన్న విషయం తెలియరాలేదు.. ఏది ఏమైనా పశువుల కోసం రూ.30 వేలు ఖర్చు చేసి దూర ప్రాంతం నుంచి గ్రామం చేరువలోకి తెచ్చాకా ఇలా జరగడం బాధాకరమంటున్నారు.

• జీవాలు మూగవి.. మేము కాదు!



ప్రచండ భానుడు ఎండ తీవ్రతకు మనుషులే కాకుండా మూగజీవాలు సైతం విలవిల లాడుతున్నాయి. వినుకొండలో ఓ ఎద్దు వడదెబ్బకు గురై స్పృహ కోల్పోయింది. దక్షిణంలో బజారులో 16 వార్డులో వీధుల వెంట సంచరించే ఎద్దు ఎండ తీవ్రత ధాటికి బజారులో పడిపోవటంతో స్థానికులు పశుసంచార మొబైల్ వాహనానికి సమాచారమిచ్చారు. సిబ్బంది తక్షణమే స్పందించి సంఘటన ప్రాంతానికి చేరుకుని ఎద్దుకు ప్రాథమిక చికిత్స చేశారు. ప్రస్తుతం ఎద్దు ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉంది. ఈ విషయంపై పశువైద్య ఉప సంచారకురాలు సరోజ మాట్లాడుతూ ఎక్కడైనా ఇలాంటి ఘటనలు జరిగితే ట్రోల్‌ఫ్రీ నంబరు 1962 సంప్రదిస్తే తక్షణమే వైద్య సేవలు సకాలంలో అందించి మూగ జీవాలను సంరక్షణ చేస్తామన్నారు. -వినుకొండ (నూజెండ్ల)

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో 2023–2024 సంవత్సరానికి గాను 6వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ బి. రవినాయక్ బుధవారం తెలిపారు. 6వ తరగతిలో చేరటానికి ప్రవేశ పరీక్ష ద్వారా, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు 10వ తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుందన్నారు. 6వ తరగతి ప్రవేశం కోరే విద్యార్థులు సెప్టెంబర్ 2011 నుండి ఆగస్టు 2013వ సంవత్సరం మధ్య జన్మించి ఉండాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2021–22, 2022–23 సంవత్సరాలలో చదివి ఉండాలన్నారు. 5వ తరగతి పూర్తి చేసుకుని 6వ తరగతికి ప్రమోషన్ అర్హత కలిగి ఉండాలన్నారు. ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా, ప్రభుత్వ రిజర్వేషన్ ప్రకారం ఎంపిక జరుగుతుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు. ఫోన్ ద్వారా అయితే 9701030357. 7032996451 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.